


# 3. విదుర నీతి

**నేపథ్యం:**

- కింది ఆకృతిని పూరించండి.




- నీతి – నీతి కథ అనగానేమి?

ఇప్పుడు ఈ పాఠంలో ఎవరు, ఎవరికి, ఎందుకు, ఏమని నీతిని బోధించారు. చదివి తెలుసుకుందామా!



క. ధనమును, విద్యయు, వంశం
బును దుర్మతులకు మదం బొనరించును; స
జ్జనులైన వారికడకువ
యును, వినయము నివియ తెచ్చునుర్వీనాథా! 1


క. కోపము, నుబ్బును, గర్వము
నాపోవక యునికి యును, దురభిమానము, ని
ర్వ్యాపారత్వము నను నివి
కాపురుష గుణంబులండ్రు కౌరవనాథా! 2

క. తను లోకము గొని యాడగ
విని యుబ్బడు సజ్జనుండు; వెండియు గడుమే
లొనరించు; గీడొకించుక
యును దనదెస దోప నీక యుడుపుచువచ్చున్ 3



క. తనువున విఱిగిన యలుగుల
ననువున బుచ్చంగ వచ్చు; నతినిష్ఠురతన్
మనమున నాటిన మాటలు
వినుమెన్ని యుపాయములను వెడలునె? యధిపా! 4

క. పురుషుండు రెండు దెఱగుల
ధరనుత్తముడనగ బరుగు దానెయ్యెడలం
బరుషములు పలుక కునికిన్
దురితంబులు వొరయు పనులు దొఱగుట కతనన్ 5



## I. వినండి-సంభాషించండి.

1. సుభాషితములు అని వేనిని అంటారు?
2. విద్య వలన ఉపయోగాలేంటి?
3. విదురనీతి- దీనిని ఎవరు ఎవరికి చెప్పారు?

## II. చదవండి-ఆలోచించండి-రాయండి.

### పదజాలాన్ని పెంపొందించుకుందాం-భావాలు నేర్చుకుందాం.

**1.** దుర్మతులు = చెడు బుద్ధి కలిగినవారు; మదము = గర్వము; అణకువ = వినయము
ఓ ధృతరాష్ట్రా! ధనము, విద్య, ఉత్తమ వంశమున జన్మించుట అన్నవి దుష్ట బుద్ధికలవారికి గర్వాన్ని కలిగిస్తాయి. అవే సజ్జనులకు వినయాన్ని, గౌరవాన్ని తెచ్చిపెడతాయి.

**2.** ఉబ్బు = పొంగిపోవు; ఆపోవక = అసంతృప్తి; నిర్వ్యాపారత్వము = ఏ పని చేయకపోవడం;
కాపురుషులు = దుర్జనులు.
ఓ ధృతరాష్ట్రా! కోపము, పొగడ్తలకు పొంగిపోవటము, గర్వము, అసంతృప్తి, దురభిమానం, ఏ పని చేయకపోవడం అను ఆరు దుర్జనుని లక్షణాలు.

**3.** కొనియాడుట = పొగడుట; ఉబ్బుట = సంతోషించుట; వెండియు = అంతేకాక; ఒనరించు = చేయు;
ఒకించుక = కొంచెము కూడా
సజ్జనుడు తనను ఇతరులు పొగిడినట్లైన విని పొంగిపోడు, ఇంకా ఎంతో మేలు చేస్తాడు. తన వైపు నుండి ఇతరులకు, ఎటువంటి కీడు కలుగకుండా ప్రవర్తిస్తాడు.

**4.** తనువు = శరీరము; అలుగు = బాణము; అనువున = ఉపాయంతో; నిష్ఠురతన్ = కఠినమైన; మనమున = మనస్సున
ధృతరాష్ట్ర మహారాజా ! శరీరంలో గుచ్చుకున్న బాణాలను ఉపాయంతో తీసివేయవచ్చు. కాని మనస్సులో గట్టిగా నాటుకున్న నిష్ఠురమైన మాటలను ఎన్ని ఉపాయాలచేతనైనా తొలగింపజాలము.

**5.** పరుషము = కఠినము; దురితంబులు = చెడు కార్యములు
ఎక్కడా కఠినముగా మాట్లాడకుండా వుండటం, చెడు కార్యములు చేయకపోవడం, ఈ రెండింటి వల్ల లోకంలో మానవుడు ఉత్తముడనిపించుకొనును.

**III. కృత్యం:**

కింది పద్యాలను చదివి సూచనానుసారం కృత్యాలను చేయండి:

అ. **(i) కింది వాక్యాలను ఎవరు ఎవరితో అనిరి.**

1. తనువున విఱిగిన యలుగుల ననువున బుచ్చంగవచ్చు.
2. దురితంబులు వొరయు పనులు దొఱఁగుట కతనన్.

**(ii). వ్యతిరేక పదాలు రాయండి.**

1. ఉపాయము x ______ 2. ఉత్తముడు x ______



పాఠ్యభాగంలోని 4, 5 పద్యాలు

ఆ. **స్వీయ స్పందన**

ఈ పద్యాల కావ్య సౌందర్యాన్ని మీ సొంత మాటల్లో రాయండి.

**IV. వినండి-చర్చించండి-రాయండి.**

అ.
1. దుష్టులకు గర్వాన్ని కలిగించేవి ఏవి? 2. దుర్జనుని లక్షణాలేవి?
3. సజ్జనుడు ఎలా ప్రవర్తిస్తాడు? 4. మాటలకున్న శక్తి ఎట్టిది?

ఆ. **తగిన పదాలతో ఖాళీలను పూరించుము.**

1. సజ్జనులైన వారికడకువయును ______________ ఇవియు తెచ్చు.
2. లోకము కొనియాడగ విని ______________ సజ్జనుండు.
3. మనమున నాటిన మాటలు వినుమెన్ని ______________ వెడలునె.

ఇ. **తప్పొప్పులను గుర్తించి రాయండి.**

1. దుర్జనులైన వారి కడకువయును, వినయమునివియ తెచ్చు. ( )
2. మేలొకించుకయును దన దెస దోపనీక యుడువుచువచ్చున్. ( )
3. మనమున నాటిన మాటలు వినుమెన్ని యుపాయములను వెడలునే. ( )

**V. స్వీయ వ్యక్తీకరణ**

1. 'సత్పురుషుల' లక్షణాలను సొంత వాక్యాల్లో రాయండి.
2. మానవుడెట్లు ఉత్తముడనిపించుకొనునో నీ సొంత మాటల్లో రాయుము.

**VI. భాషావగాహన**

అ. **పదాలను కలిపి రాయండి.**


1. సజ్జనులు + ఐన 2. ఒక + ఇంచుక 3. వినుము + ఎన్ని 4. మేలు + ఒనరించు

ఆ. **ప్రకృతి-వికృతులు రాయండి.**

1. విద్య ______ 2. దెస ______ 3. గుణము ______

**VII. సృజనాత్మకత**

దినపత్రిక/ వార్తాపత్రికలలో వచ్చే నీతి పద్యాలను సేకరించి మీ మిత్రులతో చర్చించండి. వాటి భావము రాయండి.



**నేనివి నేర్చుకున్నా/తెలుసుకున్నా**

1. సజ్జనుల లక్షణాలు 2. మాటలకున్న శక్తి

95VXUA

**ఉ.సూ:** 1. మీకు తెలిసిన నీతి కథలను, నీతిపద్యాలను విద్యార్థులకు బోధించవలెను.
2. మరికొన్ని నీతి కథలను, నీతి పద్యాలను అంతర్జాలంలో చూడమని విద్యార్థులకు చెప్పవలెను.